
ప్రజాశక్తి
శుక్రవారం 28 నవంబర్ 2025 5
శ్రీ సత్యసాయి



అనంతలో విషాదం



మృతి చెందిన తల్లి, తన నాలుగేళ్ల కుమారుడు

◆ శారదా నగర్‌లో తల్లీకుమారుడు మృతి
◆ మృతులు రామగిరి డిప్యూటీ తహాశీల్దార్ భార్య, కుమారుడు

వార్త మెయిన్‌లో

ఊరెళ్దామని తీసుకెళ్లి.. ఊపిరితీశాడు..!

అత్తమ్మ దగ్గరకెళ్దామంటే ఆనంద పడ్డాడు.. దారిలో తినుబండారులు తీసుకుందామంటే సంబరపడ్డాడు.. అమ్మానాన్న కూడా వెనుక వస్తారంటే నమ్మాడు.. వచ్చింది మామయ్యే కదా అని పాఠశాలలో బ్యాగును భుజానకేసుకుని ధైర్యంగా అతని వెంట వెళ్లాడు. పాపం ఆ పసిమనసుకు తెలియలేదు తాను వెళ్తున్నది అత్తమ్మ దగ్గరికి కాదు తిరిగిరాని లోకానికని.. తనను తీసుకెళ్తున్నది మామయ్య రూపంలో ఉన్న రాక్షసుడని..! ఒళ్లంతా విషాన్ని నింపుకున్న ఆ కిరాతకుడు తన కసాయి తనాన్ని బయటకు తీశాడు. తల్లిదండ్రులతో సమానంగా ముద్దుగా చూసుకోవాల్సిన అల్లుడిని అంతం చేసేందుకు తెగబడ్డాడు. ఊరికి తీసుకెళ్తున్నానని చెప్పి దారి మధ్యలో ఊపిరాడకుండా చేశాడు. అడగ్గానే బావ డబ్బులు ఇవ్వలేదన్న కక్షతో అతని కుమారున్ని అత్యంత కిరాతకంగా హత్య చేసి తన క్రూరత్వాన్ని ప్రదర్శించాడు. తల్లిదండ్రులకు తీరని గర్భశోకాన్ని మిగిల్చిన ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం మరకమ్మదిన్నె-జవకల గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...



హర్షవర్ధన్(ఫైల్‌ఫొటో)

◆ నాలుగేళ్ల బాలుడు దారుణహత్య
◆ గొంతునులిమి ఊపిరాడకుండా చేసి...
◆ కిరాతకానికి పాల్పడిన మేనత్త భర్త
◆ తల్లిదండ్రులకు తీరని గర్భశోకం
◆ గరికపల్లిలో విషాదం



ప్రజాశక్తి-తలుపుల, ఎన్‌పి.కుంట

సత్యసాయి జిల్లా తలుపుల మండలం ఓబుళరెడ్డి పంచాయతీ గరికవారిపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ, గంగాధర్ భార్యాభర్తలు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు హర్షవర్ధన్(4) సంతానం. గంగాధర్ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కూతురి తర్వాత కుమారుడు జన్మించడంతో ఎంతో అల్లారుముద్దుగా తల్లిదండ్రులు అతన్ని చూసుకుంటున్నారు. బాలునికి నాలుగు సంవత్సరాలు కావడంతో వారి గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాలకు పంపుతున్నారు. ప్రతి రోజులాగానే బుధవారం నాడు కూడా బాలుడు హర్షవర్ధన్ అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లాడు.

అంగన్‌వాడీ కేంద్రం నుంచి తీసుకెళ్లి హత్య

కదిరి మండలం మూర్తిపల్లిలో వద్దే గంగాధర్ అక్క భర్త ప్రసాద్ నివాసం ఉంటున్నాడు. ఇతని కుమారుడు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. కుమారుని వైద్య చికిత్సల నిమిత్తం తన బావ గంగాధర్‌ను ప్రసాద్ డబ్బులు అడిగాడు. గంగాధర్ కొన్నిసార్లు సాయం చేశాడు. ఇటీవల డబ్బులు అడగ్గా గంగాధర్ తన వద్దలేవని చెప్పాడు. దీంతో ప్రసాద్ తన బావపై కక్ష పెంచుకున్నాడు. తాను పడుతున్న బాధే అతనూ పడాలనే కసాయి మనస్థత్వానికి వచ్చాడు. అందులో భాగంగా గంగాధర్ కుమారుడు హర్షవర్ధన్‌ను బుధవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రం నుంచి తన ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడు. అత్తమ్మ ఇంటికి వెళ్దామని చెప్పడంతో బాలుడు మామయ్య బండిలో ఎక్కి అతనితో వెళ్లాడు.

గొంతునులిమి.. ఊపిరితీసి..!

అంగన్‌వాడీ కేంద్రం నుంచి బుధవారం ఉదయం 11-30 గంటలకు బాలున్ని ప్రసాద్ తన ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడు. మొదటి సారి బాలుని ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. మళ్లీ కొంతసేపటి తర్వాత ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయం చూసుకుని ప్రసాద్ మరోసారి వారి ఇంటివద్దకెళ్లాడు. అత్తమ్మ దగ్గరకు వెళ్తున్నామని చెప్పడంతో బాలుడు నమ్మి అతనితో వెళ్లాడు. నంబులపూలకుంట మండలం మరకమ్మదిన్నె-జకవకల గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలోకి బాలున్ని తీసుకెళ్లాడు. అక్కడ ప్రసాద్ బాలుని గొంతునులుమి హత్య చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ఏమీ తెలియని వాడిలా అతని ఇంటికి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 1 గంట అయినా కుమారుడు ఇంటికి రావడంతో తల్లి ఆందోళనకు గురైంది. వెంటనే అంగన్‌వాడీ కేంద్రంకు వెళ్లి విచారించగా బాలున్ని ప్రసాద్ ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని వెళ్లినట్లు అక్కడి సిబ్బంది చెప్పారు. వెంటనే ప్రసాద్‌కు ఫోన్ చేయగా తన వద్ద బాలుడు లేడని అప్పుడే మీ ఇంటి వద్ద వదిలి వచ్చేశానంటూ సమాధానం ఇచ్చాడు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.



ఘటనా స్థలం వద్ద బాలుని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు

అటవీ ప్రాంతంలో బాలుని మృతదేహం

బాలుని మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతని ఆచూకీ కోసం ముమ్మర గాలింపు చేశారు. ప్రత్యేక బృందాలు, డాగ్‌స్క్వాడ్‌తో అన్ని ప్రాంతాల్లోనూ విచారించారు. ఈ క్రమంలో బాలుని తల్లిదండ్రులతోనూ వివరాలు సేకరించారు. ఈ సమయంలో బాలుని తండ్రి తన బావ ప్రసాద్‌పై అనుమానం వ్యక్తం చేశాడు. ఆదిశగా పోలీసులు విచారణ చేపట్టి ప్రసాద్ వెళ్లిన ప్రాంతాల్లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా గురువారం వేకువజామున నంబులపూలకుంట మండలం మరకమ్మదిన్నె-జకవకల గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో బాలుని మృతదేహం కన్పించింది. కుమారుని మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు గుండెలు పగిలేలా కన్నీటి పర్యవంతం అయ్యారు. ఉదయాన్నే నవ్వుతూ ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు విఘతజీవిగా పడి ఉండడాన్ని చూసి శోకసంద్రంలో మునిగిపోయారు.

ఊపిరాడకుండా చేసి చంపేశాడు..: ఎస్పీ

బాలుడు హర్షవర్ధన్‌ను ఊపిరాడకుండా చేసి చంపేశారని సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. బాలుని మిస్సింగ్, హత్యకు సంబంధించిన వివరాలను గురువారం మధ్యాహ్నం కదిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. బాలుడు కన్పించలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగానే మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. అందులో భాగంగా గురువారం ఉదయం పోలీసుల గాలింపుల్లో బాలుని మృతదేహాన్ని జవకల గ్రామ అటవీ ప్రాంతంలో గుర్తించామన్నారు. తల్లిదండ్రుల అనుమానం మేరకు బాలుని మేనత్త భర్త ప్రసాద్ ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామని తెలిపారు. నిందితుడు ప్రసాద్ కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అతన్ని పట్టుకుంటామని తెలియజేశారు. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, నంబులపూలకుంట ఎస్ఐ వలిబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రైతును ముంచి...కార్పొరేట్‌కు దోచిపెట్టి..!

◆ అన్నదాతలకు నష్టంగా పాలకుల విధానాలు
◆ ఐక్యంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం
◆ ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి
◆ గార్లదిన్నెలో 'అనంత' ఎపి రైతుసంఘం జిల్లా మహాసభలు



రైతుసంఘం జిల్లా మహాసభల సందర్భంగా గార్లదిన్నెలో రైతులతో కలిసి ప్రదర్శన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ రైతును పూర్తిగా ముంచేసి, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం దేశంలో సాగుతోందని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఎపి రైతు సంఘం జిల్లా మహాసభ గురువారం నాడు గార్లదిన్నె మండల కేంద్రంలో ఆరంభమయ్యాయి. రెండు రోజులపాటు జరుగుతున్న ఈ మహాసభ మొదటి రోజు మండల కేంద్రంలో ప్రదర్శన చేపట్టారు. ట్రాక్టర్లతో ముందు వరుసలో రాగా, వెనుక నాయకులు ప్రదర్శన చేపట్టారు. అనంతరం గార్లదిన్నె గ్రామ కూడలిలో బహిరంగ సభ జరిగింది. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతాంగ సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని విమర్శించారు. రైతులకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాలంలో చూస్తే అరటి, పత్తి, ఉల్లి, మిరప, పప్పుశనగ ఇలా ఏ పంటకూ సరైన గిట్టుబాటు ధర లేదని స్పష్టమవుతోందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే సరైన గిట్టుబాటు ధరను అందివ్వలేకపోతున్నారని విమర్శించారు. పత్తి పంటకు క్వింటాళుకు రూ.8110 కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఆచరణలో చూస్తే బహిరంగ మార్కెట్‌లో రూ.5000 కూడా ధర లభించలేదని తెలిపారు. కొనుగోలు చేయాల్సిన సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పుణ్యకాలం పూర్తయ్యాక అక్టోబర్ ఆఖరులో కొనుగోళ్లు ఆరంభించిందన్నారు. అప్పటి వర్షాలు అధికమై తేమ శాతం పెరగడంతో ఆ సాకు చూపించి నామమాత్రంగానే కొనుగోళ్లు చేసిందని పేర్కొన్నారు. ఇక మొక్కజొన్నకు క్వింటాళు రూ.2100 ప్రకటించిందన్నారు. కాని మార్కెట్‌లో రైతుకు లభిస్తున్న ధర రూ.1800లోపే ఉందన్నారు. ఇలా ఏ పంట చూసుకున్నా మద్దతు ధర లేదన్నారు. పప్పుశనగపై పూర్తి సుంకాన్ని ఎత్తివేసిందన్నారు. దీని వల్ల ఇక్కడ రైతులకు మరింత నష్టం జరుగుతుందని తెలిపారు. దేశంలోని రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యవసాయ రంగం నుంచి రైతులను పారదోలే ప్రయత్నం సాగుతోందన్నారు.

రైతుసంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ దేశంలోని వ్యవసాయ రంగంపై కార్పొరేట్ శక్తుల కన్ను పడిందన్నారు. ఈ రంగంలో ఇప్పుడున్న చిన్న, సన్నకారు రైతులను పారదోలి వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయని వివరించారు. ఆరుగాలం కష్టపడి రైతులు పంట పండించినా ఏ ఒక్క పంటకు సరైన గిటుబాటు ధర లభించకుండా ప్రభుత్వాలే చేస్తున్నాయన్నారు. పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రైతుకు దక్కకుండా చేస్తున్నాయని విమర్శించారు. ఇలా చేసి వ్యవసాయం నుంచి రైతును తప్పుకునే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాల విధానాలపై రైతులంతా ఏకమై కలసి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. లేకపోతే రైతు అనే వాడే మిగిలే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఎపి రైతు సంఘం ఆ దిశగా కృషి చేస్తుందని భరోసానిచ్చారు.

ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యానవన పంటలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని పాలకులు చెబుతున్న మాటలు ఆచరణలో అమలు జరగడం లేదని చెప్పారు. ఇటీవలి కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. రైతులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే సరైన ధరల్లేక తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. కనీసం వారికి మద్దతు ధర కల్పించే విధంగానూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతు సంఘం సత్యసాయి జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాల భూములను కట్టబెడుతున్నారన్నారు. సత్యసాయి జిల్లాలో లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతోనూ, సైన్స్ సిటీ పేరుతో, సోలార్ పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాలు భూములు సేకరించారని తెలిపారు. ఈ భూములు కోల్పోయిన రైతులు గ్రామాలను వదిలి వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం వలసలు వెలుతున్నారన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు మూడు ఎకరాల భూమి ఇస్తామన్న హామీ అమలు జరగ లేదని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై కలసి పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు బాలరంగయ్య, మధుసూదన్, సీనియర్ నాయకులు ఎంకె.వెంకటరెడ్డి, బిహెచ్.రాయుడు పాల్గొన్నారు.





రైతుసంఘం జిల్లా మహాసభల్లో ప్రసంగిస్తున్న వి.రాంభూపాల్, ప్రభాకర్‌రెడ్డి

పేదలకు ఇళ్ల స్థలాలపై 29న సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-పెనుకొండ

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈ నెల 29వ తేదీ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా కరపత్రాలు విడుదల చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి మాట్లాడుతూ పట్టణంలో సొంతిల్లు లేని పేదలు మూడేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం వివిధ రూపాల్లో పోరాటాలు చేశారన్నారు. సర్వే నెంబర్ 688-3లో వేసుకున్న గుడిసెలను అధికారులు దౌర్జన్యంగా తొలగించి అరెస్టు చేసి నాయకులపై కేసులు కూడా బనాయించారని మండిపడ్డారు. ప్రజలందరూ ఏకమై పోరాడితే తప్ప సొంతింటి కల సాకారం కాదన్నారు. కావున సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 29 తేదీ పెనుకొండ ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబావలి, వెంకటరాముడు, తిప్పన్న, అంజనప్ప, జబ్బార్, వెంకటేష్, ప్రజాసంఘాల నాయకులు బావమ్మ, మాబున్నీసా, సావిత్రమ్మ, లక్ష్మీదేవి, శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

డి.రామగిరిలో వాల్మీకి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మడకశిర టౌన్

వాల్మీకి మహర్షి ప్రపంచానికి ఆదర్శపురుషుడని, ప్రతిఒక్కరూ ఆయన చూపిన బాటలో నడవా లని ప్రముఖులు సూచించారు. మండలంలోని డి.రామగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సతీమణి ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రొళ్ల జడ్పిటిసి అనంతరాజు, మాజీ మంత్రి హెచ్‌పి. నరసే గౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్‌రెడ్డి, మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు అశ్వత్థనారాయణ పాల్గొని వాల్మీకి జీవితచరిత్రను వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ నరసింహరాజు, వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, టిడిపి మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు, రొళ్ల జడ్పిటిసి అనంతరాజు, మాజీ మంత్రి హెచ్‌పి.నరసేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్‌రెడ్డి, మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు అశ్వత్థనారాయణ, పాల్గొన్నారు. అనంతరం గుండుమల తిప్పేస్వామి అమిదాలగొంది గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో విడత అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ విపత్తులపై అవగాహన

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురు కుల పాఠశాల, కళాశాలలో గురువారం సహజ విపత్తులు, మానవ నిర్మిత విపత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ బృందం ఇన్‌స్పెక్టర్ శాంతిల్ సహజ విపత్తులు, మానవ నిర్మిత విపత్తుల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, భూకంపాలు సంభవించినప్పుడు, దట్టమైన పొగలు అల్లుకొన్నపుడు ప్రాణాపాయ స్థితి నుంచి సురక్షితంగా తప్పించుకోవడంపై తెలిపారు. ఇన్ఫంట్ చిల్డ్రన్స్ హార్ట్ అరెస్ట్‌కు గురైనపుడు సిపిఆర్ చేసి ఎలా రక్షించాలో ప్రదర్శన ద్వారా సూచించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు సుందరరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపల్ చందన, హెడ్ కానిస్టేబుల్ పాటిల్, రామకృష్ణ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



విపత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పాఠశాలను సందర్శించిన డైట్ లెక్చరర్, ఎంఇఒలు

బేస్ లైన్ సర్వే తనిఖీ

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచటానికి కూటమి ప్రభుత్వం ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ బేస్ లైన్ సర్వే చేపట్టింది. అందులో భాగంగా డైట్ విద్యార్థులు, సిఆర్‌ఎంటిల చేత సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని తురకలాపట్నం, రొద్దం, చెరుకూరు పాఠశాలల్లో జరుగుతున్న సర్వేను గురువారం డైట్ సీనియర్ లెక్చరర్ శివరామ్, ఎంఇఒలు అరవింద్, జయభాస్కర్ తనిఖీ చేశారా. వారి వెంట రొద్దం ఫౌండేషన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు రామాంజి, తదితరులు ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణానికి చెందిన యువ నేత, మాజీ ఎంపిటిసి నిమ్మల యువశేఖర్ పుట్టిన రోజు వేడుకలను గురువారం అభిమానులు, కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అయ్యప్పస్వామి ఆలయంలో యువ శేఖర్ అన్నదానం చేశారు. అలాగే అయ్యప్ప మాలధారులకు బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరిణి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్‌బాషా, నాయకులు వృషభ, ఈశ్వరయ్య, నాగరాజు, గణేష్, జయ, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు



అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న యువ నేత నిమ్మల యువ శేఖర్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-అమరాపురం

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ తక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని తండేపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో గురువారం ముఖ్యఅతిథి గుండుమల తిప్పేస్వామి రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వం వంద శాతం అమలు చేస్తుందన్నారు. తండేపల్లి కార్యదర్శి యోగేందర్‌ను అడిగి పంచాయతీలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల వ్యవసాయ అధికారి మంజునాథ్, ఎంపిటిసిలు లింగరాజు, ఓంకార్‌స్వామి, నాయకులు ప్రసాద్, శివరుద్రప్ప, హనుమంతరాయ, మంజునాథ్ పాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాలు పంపిణీచేస్తున్న తిప్పేస్వామి, నాయకులు

గంగంపల్లిలో 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని గంగంపల్లి గ్రామంలో గురువారం టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణచౌదరితో పాటు మండల వ్యవసాయ అధికారి శంకర్‌నాయక్, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్‌తో పాటు పలు సంక్షేమ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిందా అని ఆరా తీశారు. వారి వెంట నాయకులు నిమ్మల శ్రీధర్, నాగేనాయక్, రుద్రప్ప, రోహిత్, సుభహాన్, రైతులు ఉన్నారు.

పి-4పై శిక్షణ

ప్రజాశక్తి-అమరాపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం పి-4 కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిం చినట్లు ఎంపిడిఒ రామారావు తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో బాధపడకూడదని, నిరుపేదలు లేని దేశంగా ఎదగాలనే దృఢ సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో పి-4 కార్యక్రమనికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావడం, పర్యావరణ పరిరక్షణ, సమతుల్యత కోసం ప్రభుత్వాలు పనిచేస్తు న్నాయన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ఆరాధ్య, ఈఓఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు నరేష్‌బాబు, ఈరన్న, యోగానంద్, రాజేష్, సురేష్, వీరకరియప్ప, గౌరమ్మ, నాగమణి, ఆశా వర్కర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-రొద్దం

విగ్రహ దాత మంత్రి సవిత ఆదేశాల మేరకు గురువారం మండలంలోని పి.రొప్పాల గ్రామం లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు టిడిపి మండల నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, నాయకులు చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, టైలర్ ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ నరసింహులు, మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర టౌన్

గ్రామాల్లో చేపట్టిన రోడ్డు పనులను గురువారం పంచాయతీ రాజ్ అధికారులు పరిశీలించారు. పిఆర్ ప్రాజెక్ట్ ఈఈ శంకరయ్య, డీఈ వెంకటేశులు, ఏఈ విశ్వనాథ్ సి.రంగాపురం, దేవన్నపాలెం, హారేసముద్రం గ్రామాల్లో పర్యటించి రూ. 2.13 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వానవోలు సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని వానవోలు గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపిడిఒ కమలాబాయి తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చిన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. ప్రభు త్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ఎంపిడిఒ వెంట సచివాలయ కార్య దర్శి జైపాల్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నాయకులు రంగనాథ్, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-అమరాపురం

రాబోయే ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవడంపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని తమ్మడేపల్లి గ్రామంలో గురువారం చేపట్టిన రైతన్నా మీకోసం' కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ పాల్గొన్నారు. వారితో పాటు టిడిపి నాయకులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి సంబంధించి రూపొందించిన ఐదు సూత్రాలను రైతులకు వివరించారు. సిఎం చంద్రబాబు సందేశాన్ని వివరించారు. వారి వెంట రైతు సేవా కేంద్రాల ఉద్యోగులు, వెటర్నరీ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మందలపల్లి తండాలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు శ్రమదానం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పిఒ శివశంకర్ ఆధ్వర్యంలో విద్యా ప్రాముఖ్యత, సాంఘిక కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ వీధుల్లో ముళ్లపొదలు, చెత్తచెదారం తొలగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామ్‌దాస్‌నాయక్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి - పరిగి

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని పెనుగొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఫర్వీన్ తాజ్ సూచించారు. బుధవారం పరిగి మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించేలా పనిచేయాలని సూచించారు. అధిష్టానం సూచన మేరకు పరిగి మండలంలోని కొన్ని వార్డులను బలోపేతం చేసే ఉద్దేశంతో వారి సూచనల మేరకు సమావేశం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఇప్పటినుండి అందరూ కృషి చేస్తేనే స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకునే అవకాశం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, సూరి, నారాయణ, సోమప్ప, వెంకటేష్, సంజీవరాయప్ప, పుట్టగొర్లపల్లి రామాంజి, నాయకులు, డీలర్లు, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నల్లమాడ

మండలకేంద్రంలో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు గోవింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒకు అందజేశారు. ఈసందర్భంగా గోవిందు మాట్లాడుతూ అక్కమ్మ గారి కాలనీలో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. రామస్వామి వీధి నుంచి సిసి రోడ్డు లేదన్నారు. సత్తెమ్మ బజారు నుంచి ఎస్సీ కాలనీ వరకు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మల్లికార్జున, రామయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కొత్తచెరువు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీకాకుళం జిల్లాలో జరిగిన అండర్ – 14 రాష్ట్రస్థాయి పోటీలలో కొత్తచెరువు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన దేవిక అనే విద్యార్థి ప్రతిభ కనపర్చింది. వందమీటర్ల పరుగు పందెం పోటీలో రాష్ట్రంలో నాలుగో స్థానాన్ని సాధించింది. ప్రస్తుతం పాఠశాలలో 9వ తరగతి చదువుతూ చక్కటి క్రమశిక్షణ కలిగి ఉండి ప్రతిభా కనబరిచారన్నారు. హెచ్ఎం నూర్జహాన్, పీఈటీ సూర్యనారాయణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్లపై మురుగు

ప్రజాశక్తి - బుక్కపట్నం

బుక్కపట్నం గ్రామంలోని సబ్ రిజిస్టర్ ఆఫీస్ మెయిన్ రోడ్డు, పురాతన శివాలయం, సుందరయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారి మీదుగా పారుతున్న మురుగునీటిని అరికట్టాలని పర్యావరణవేత్త భాస్కర నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఎంపీడీవో శ్రీనివాసులు కు వినతి పత్రం సమర్పించారు.. ఈ సందర్భంగా భాస్కరనాయుడు మాట్లాడుతూ కొంతమంది తమ ఇళ్లలోనుండే మురుగునీరు, పాత్రల కడిగిన నీరు, బట్టలు శుభ్రం చేసిన నీరు రోడ్డుపైకి వదులుతున్నారన్నారు. దీని వల్ల రహదారులపై నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్ లో జిల్లా పరిషత్ హై స్కూల్ పక్కనే మురుగునీరు రోడ్డు మీద నిలబడి గుంతల మయంగా మారి దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. వెంటనే ఈ అంశంపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్ జగన్‌ను కలిసిన సర్పంచి

ప్రజాశక్తి - నల్లచెరువు

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నల్లచెరువు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీనాథ్ గురువారం కలిశారు. బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో శ్రీనాథ్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. యువ సర్పంచి శ్రీనాథ్ రెడ్డిని వైయస్ జగన్ అభినందించి యువత పాత్ర రాజకీయాల్లో కీలకమని గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.


వైఎస్ జగన్‌తో దాసరి శ్రీనాథ్

పకడ్బందీగా 'రైతన్నా మీకోసం' : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా రైతన్నా మీకోసం పథకాన్ని జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు వివిధ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా ప్రధానంగా వ్యవసాయ ఆధారితమైన జిల్లా కావడంతో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమార్థం చేపట్టిన "రైతన్నా మీకోసం" కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి పటిష్టమైన, బలమైన విధానంతో అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ఇంటికి వెళ్లి కార్యక్రమంలోని ఐదు ప్రధాన సూత్రాలు, వాటి ఉద్దేశాలు, రైతుకు అందే ప్రయోజనాల గురించి వివరంగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమం కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌ను ప్రతి రైతు డౌన్‌లోడ్ చేసుకునేందుకు సహాయపడాలని, యాప్ ఉపయోగం, దాని ప్రయోజనాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు డ్రిప్ సేద్యం ప్రయోజనం అందేలా చూడాలని, ఉద్యాన పంటల రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు ఇంటివద్దకే చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్, గృహ నిర్మాణం, ఆవాజ్ ప్లస్ సర్వే వంటి విభాగాల్లో జరుగుతున్న పనులపై వివరాలు తెలుసుకుని, సంబంధిత అధికారులకు తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం. మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, మహేష్, ఆనంద్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : పల్లె

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని డబురు వారిపల్లి లో నిర్వహించిన రైతన్న సేవలో కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇలిరాజ్ , టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర , సొసైటీ అధ్యక్షుడు బోయపల్లి శివారెడ్డి, డాక్టర్ జాకీర్ అహ్మద్, అంజినప్ప, కరుణాకర్ రెడ్డి, పొగాకు షఫి, గ్రామ కమిటీ చంద్ర, గంగిరెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ మంత్రి, తదితరులు

బాధితులకు పరామర్శ : మండల పరిధిలోని బత్తిని పల్లిలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన బాధితులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. వైద్య పరీక్షలు పొందుతున్న బాధితులను పరామర్శించారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై అక్కడున్న డాక్టర్లు భానుప్రకాష్ ,కమల్ రోహిత్‌ని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య అందించాలని కోరారు.

కష్టపడ్డ వారందరికీ గుర్తింపు

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటోందని కష్టపడిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ కుంచిటిగా వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ తదితర నాయకులతో సమావేశమై బూత్, క్లస్టర్ తదితర సమావేశాలు, కార్యకర్తల చైతన్యం తదితర అంశాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, క్లస్టర్ ఇంచార్జి రాఘవేంద్ర, అమర్నాథ్, వెంకటరమణ, ముక్తార్ అహమద్, ఫకద్దీన్, అస్లాం, నాగరాజు, ఖాజా, బిలాల్ అమీన్, మహబూబ్ బాషా, బిలాల్, అమీన్, నవీన్, దాదా పీర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్‌ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వక్కలిత చైర్మన్ వెంకటేష్, తదితరులు

పేదల భూములపై పెత్తందారుల కన్ను

స్వాధీనం చేసుకునేందుకు బెదిరింపులు
సర్వే పనులకు అడ్డుకున్న బాధిత రైతులు


సర్వే పనుల అడ్డగింత దృశ్యం

ప్రజాశక్తి -పరిగి

పేదల భూములపై పెత్తందారులు కన్నేశారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు బెదిరింపులకు దిగారు. అయినా తమకు జరుగుతున్న అన్యాయంపై రైతులు ఎదురు తిరిగారు. భూసర్వేను అడ్డుకున్నారు. తమకు అన్యాయం చేస్తే ఆత్మహత్యకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. ఇందుకు సంబందించిన బాధిత రైతులు తెలిపిన వివరాలు... మండలంలోనిబీచిగానీపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నంబర్లు 171–2,172, 173 లకు సంబంధించి శీగిపల్లి గ్రామానికి చెందిన రైతులు సాగు చేస్తున్నారు. తమ తాత ముత్తాతలకాలం నుంచి సాగు చేస్తున్న ఈ భూములు తమవే అంటూ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమను బెదిరించడమే కాకుండా అధికారులు పోలీసుల నుండి ఒత్తిడి తీసుకు వస్తున్నారని రైతులు హనుమంతు, మారుతితో పాటు మరో ఏడుగురు రైతులు వాపోతున్నారు. తమకు కేటాయించిన భూములను1932లో భీమారావు వద్ద నుంచి హనుమంతప్ప అలియాస్ కుంటేప్ప, వన్నంపల్లి హనుమంతప్ప కలిసి కొనుగోలు చేశారన్నారు. ఇద్దరు వ్యక్తులు కలిసి సమానవాటాలతో భూమిని సాగు చేస్తూ ఉండేవారన్నారు. 1948లో 171–2, 172 సర్వే నంబర్లలోని ఐదు ఎకరాల భూమిని రెండవ భాగస్వామి అయినా వన్నంపల్లి హనుమంతప్ప, హనుమంతప్ప అలియాస్ కుంటేప్ప విక్రయించారన్నారు. అదే విధంగా 1948లో హనుమంతప్ప అలియాస్ కుంటెప్ప, వన్నంపల్లి హనుమంతప్ప భార్య దేకమ్మ, సోదరుడు గంగప్పకు 12.55 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిని విక్రయించారన్నారు. మొదటి వాటాదారుడైన హనుమంతప్ప అలియాస్ కుంటేప్పకు 11.50 ఎకరాలు రెండవ వాటాదారుడైన వన్నంపల్లి హనుమంతప్పకు 26.60 ఎకరాల భూమి హక్కు కలిగి ఉన్నారన్నారు. అప్పటి నుండి వన్నంపల్లి హనుమంతప్ప వారసులు వ్యవసాయం సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. మొదటి వాటాదారుడైన హనుమంతప్ప అలియాస్ కుంటేప్ప వారసులు వారికున్న 11.50 ఎకరాల భూమితో పాటు రెండవ వాటాదారుని భూమిని సైతం కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి కోర్టు ఉత్తర్వులు సృష్టించి బడా బాబులకు విక్రయించారని ఆరోపించారు. రెండవ వాటాదారుడి వారసులు నిరక్షరాస్యులుకావడంతో రెవెన్యూ అధికారులు తమ భూమిని రికార్డుల్లో తగ్గించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బున్న బడాబాబులు 172,173 సర్వే నంబర్లలో కొంత భూమిని కొనుగోలు చేసి అధికారులను ఒత్తిడి చేస్తూ తమ అవ్వతాతులను సమాధులు చేసినటువంటి భూమిని సైతం కాజేయాలని చూస్తున్నారని సర్వే చేయడానికి వచ్చిన అధికారుల ముందు తమ గోడు వెల్లబోసుకున్నారు. 80 సంవత్సరాలుగా కొన్ని తరాలు ఆ భూమిని సాగు చేస్తూ జీవనం సాగించేవామని తమ అవ్వ తాతల సమాధుల సైతం ఆ పొలంలోనే ఉన్నాయని అన్నారు. అలాంటి భూమిని బడాబాబులు తమదంటూ దౌర్జన్యానికి పాల్పడుతూ బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహశీల్దార్, ఎస్ఐకు తమ గోడును వెల్లబోసుకున్నారు. అధికారులు రికార్డుల ఆధారాల మేరకు తాము పని చేస్తామని చెప్పుకొచ్చారు. కొంతమంది బ్రోకర్లు కమీషన్లకు కక్కుర్తి పడి తమ భూమిని కాజేయాలని చూస్తున్నారని బాధితులు ఆరోపించారు. తమ వద్ద రిజిస్టర్ అయిన డాక్యుమెంట్ నెంబర్లతో సహా నకలు కాపీలు ఉన్నాయని వాటన్నింటినీ పరిశీలించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఆత్మహత్య ఐనా చేసుకుంటాం తప్ప తమ భూములను వదులుకునేది లేదని అధికారులు తమకు అన్యాయం చేస్తే తమ భూమిలోనే ప్రాణాలు వదులుకుంటామని హెచ్చరించారు.

బత్తినపల్లిని సందర్శించిన జిల్లావైద్యాధికారిణి

ప్రజాశక్తి - ఓబుల దేవరచెరువు

ఆరోగ్య, ఆహార అలవాట్లపై ఆధారపడి జీవన ప్రమాణాల దశ దిశలకు సూచికగా పనిచేస్తుందని అందుకే ప్రజలు ఎప్పుడూ మంచి ఆహార అలవాట్లను తప్పక పాటించాలని జిల్లా వైద్యాధికారిని డాక్టర్ ఫైరోజ్ బేగం పేర్కొన్నారు. మండల పరిధిలో బత్తినిపల్లి గ్రామంలో కలుషిత ఆహారం తిని నీళ్ల విరోచనాలతో అస్వస్థతకు గురైన వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీటీ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సునీల్, డాక్టర్ నాగేంద్రనాయక్, వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్, సిబ్బంది ప్రమీల, రామకృష్ణమ్మ, దిల్షాద్, శ్రావణి, హసిన్ తాజ్, అనసూయ, గోపాల్ నాయక్, ప్రభాకర్, బాలాజీ నాయక్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

'కూటమి' మెడలు వంచుదాం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించే వరకు వైసిపి పోరాటాలు సాగిస్తుందని, పోరాటాలతోనే కూటమి ప్రభుత్వ మెడలు వంచుదామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి అన్నారు. గురువారం హిందూపురం పట్టణంలోని 17. 18వ వార్డుల పరధిలో ఫణి నగర్‌లో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ మన్సూర్, 18 వ వార్డు ఇన్చార్జ్ మనోజ్ (మింటు), 17వ వార్డు నాయకులు రాష్ట్ర మైనార్టీ సెల్ సహాయ కార్యదర్శి అమానుల్లా, పెరుస్వామి షాజహాన్, సత్తి, శివ, సల్లు, సుహేల్, మారుతి ప్రసాద్, అభిషేక్, అమర్, లోకీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దీపికా వేణురెడ్డి

చిత్రకళ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో సెప్టెంబర్ నెలలో నిర్వహించిన రంగోత్సవ జాతీయ చిత్రకళా పోటీలలో ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. క్రాఫ్ట్, ఆర్ట్ టీచర్ చంద్ర మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలలో దాదాపు 106 మంది విద్యార్థిని, విదార్థులు పాల్గొన్నారు. 1 ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విదార్థులు పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, టాటూ డిజైనింగ్ విభాగాల పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులు 25 బంగారు, 13 వెండి, 12కాంస్య పతకాలు సాధించారు. ఇందులో నేషనల్ లెవెల్ 4వ బహుమతిగా పదవ తరగతి విద్యార్థి వైష్ణవి సాధించారు. ఆర్ట్ మెరిట్ అవార్డ్ 10వ తరగతి విదార్థి మహమ్మద్ అలీ సాధించారు. 9వ తరగతి విద్యార్థి శ్రీరామ్ కన్సోలేషన్ ప్రైజ్ పాటు ప్రశంసా పత్రము సాధించారు. నాల్గవ తరగతి విద్యార్థిని జ్ఞాపిక వెంకట్ రెండు విభాగాల్లోనూ మెడల్స్ సాధించడం విశేషం. పోటీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థినికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు వంక ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని వంగలపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన శాండిల్ వుడ్ ఫామ్ లో చెరువు కాలువల ఆక్రమణ జరిగిందని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సర్పంచి బాలాజీ కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 137, 138,139, సుమారు 33 ఎకరాలకు పైగా ఎస్టేట్ బుల్ రియాల్టర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రైతుల నుండి భూములను కొనుగోలు చేసి ఈ భూములలో ఉన్న వంకను మళ్లించి వారికి అనుగుణంగా మలుచుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మళ్లింపు వల్ల చెరువుకు రావాల్సిన నీరు చేరే అవకాశం లేదని వెంటనే ఆక్రమణకు గురైన కాలువను పునరుద్ధరించి చెరువుకు నీరు అందే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. అధికారులు స్పందించకపోతే బాధిత రైతులతో కలసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.


నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూముకుంట చెక్ పోస్ట్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ మండలం పూలకుంట నుంచి బెంగళూరు వెళ్లాలని హనుమంత (19) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. రూరల్ మండలం గోళాపురానికి చెందిన రమేష్ తన భార్యను తీసుకొని ద్విచక్ర వాహనంలో హిందూపురం వస్తున్నాడు. చెక్ పోస్టు సమీపంలో పొగ మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో హనుమంత (19) అక్కడిక్కడే మృతిచెందాడు. రమేష్‌కు, ఆయన భార్యకు గాయాలు అయినాయి. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన అసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు.

తిరిగి వస్తానంటూ వెళ్లి పరలోకం వెళ్లావా..: హిందూపురం రూరల్ మండలం పూలకుంట గ్రామానికి చెందిన ఉప్పర ఆంజినేయులు స్థానికంగా ఉపాధి లేక పోవడంతోకొన్ని నెలల క్రితం బెంగళూరులోని యలహంకకు వలస వెళ్లాడు. ఆంజినేయులు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుండగా అతని భార్య లక్ష్మీదేవి పలు ఇండ్లలో ఇంటి పనులు చేస్తూ జీవనం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఇందులో హనుమంత బెంగళూరులో ఓ ప్రవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. మరో కుమారుడు 10వ తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో హనుమంత బుధవారం యలహంక నుంచి సొంత గ్రామం అయిన పూలకుంటకు పని నిమిత్తం వచ్చాడు. పని చూసుకొని తిరిగి వెళ్లాలని గురువారం తెల్లవారుజామున బెంగళూరుకు ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. తెల్లవారు జామున కావడంతో పొగ మంచు తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎదరుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం కనబడక పోవడంతో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. హనుమంత మృతివార్త తెలుసుకున్న తల్లిదండ్రులు హిందూపురం ప్రభుత్వ అసుపత్రి వద్దకు వచ్చి ఆర్తనాదాలు చేశారు. తిరిగి వస్తానంటు సొంత ఊరికి వచ్చి పరలోకాలకు వెళ్లావా అంటు మృతురాలి తల్లి లక్ష్మీదేవి చేస్తున్న రోదనలు కంటతడి పెట్టించాయి. స్థానికంగా ఉపాధి లేక బిడ్డల కోసం ఊరి వదలి పోయామని...ఆ బిడ్డే దూరం అయితే తాము ఎందుకు బతకాలంటూ మృతుని తల్లిదండ్రులు రోధించారు. ఇప్పటికైన ప్రభుతాలు భూసేకరణ చట్టాన్ని అడ్డుపెట్టుకొని భూమి రైతుల నుంచి లాక్కోవడం మానుకొని. రైతులకు, కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని సత్యనారాయణపేటకు చెందిన భానుతేజ (20) అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. సెల్ ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తూ ఉండడంతో తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన భాను తేజ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. భాను తేజ పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. తల్లి సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుడిబండ

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కరికెర గ్రామానికి చెందిన జూలప్ప కుమారుడు చంద్రప్ప(35) మృతి చెందాడు. ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపిన వివరాలు.. మడకశిర మండలంలోని నీలకంఠాపురం గ్రామం వద్ద ఉన్న సోలార్ కంపెనీలో చంద్రప్ప సెక్యూరిటీ గార్డ్‌గా పని చేసేవాడు. ఈ నెల 25వ తేదీ రాత్రి 7:30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్తుండగా బూదిపల్లి గ్రామ శివారులో వాటర్ ట్యాంక్ వద్ద కుక్కను తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్రమైన గాయం కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. అతడికి భార్య రూపాతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. చంద్రప్ప భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ బైపాస్ లోని దొరిగల్లు రోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. అక్రమ్ భాష అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో తన పొలం దగ్గరికి వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన 108 వాహనం లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గురువారం రెవిన్యూ డివిజనల్ అధికారులు దాడులు నిర్వహించి కొడవండ్లపల్లి లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను, రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకోని పోలీస్ శాఖ కు అప్పగించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటామని ఆర్డీవో హెచ్చరించారు.


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు, తదితరులు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - తలుపుల

బాలుడిని హత్య చేసిన నిందితుడు ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాలుడి హత్యను నిరసిస్తూ మండల కేంద్రంలో ప్రజా సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కొవ్వొత్తుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ బాలుడినిహత్య చేయడం దారుణమన్నారు. ఏమైనా భేద అభిప్రాయాలు ఉంటే కుటుంబ పెద్దలతో కలిసి చర్చించుకుని పరిష్కరించుకోవాలన్నారు. ఇలా హత్యలు చేయడం ఆటవిక చర్య అని అన్నారు.కార్యక్రమంలో నాయకులు సిద్దయ్య అస్సాం , ఎద్దుల రాముడు , రవి,రాజశేఖర్, పవన్, అమర్నాథ్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, బాబావలి, డ్రైవర్ అసోసియేషన్ అసోసియేషన్ సభ్యులు భవన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

కదిరి టౌన్ : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృయాలని సమత స్వచంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు పిలుపు ఇచ్చారు.బాల్య వివాహాల రహిత భారతదేశం నిర్మించడంలో సమత స్వచ్ఛంద సంస్థ పాలు పంచుకుంటుందని సమత స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ ఆదినారాయణ రెడ్డి తెలిపారు. గురువారం జస్ట్ రైట్స్ సంస్థ సహకారంతో సమత స్వచ్ఛంద సంస్థ వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో సత్యసాయి జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు.